క్లుప్తంగా

చెరువు పూడ్చివేత పనులు నిలుపుదల



చెరువు పూడ్చివేత పనులను తనిఖీ చేసిన తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం, జగ్గమ్మగారిపేట ఇరిగేషన్ చెరువు పూడ్చివేత పనులకు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి నిలిపి వేశారు. చెరువును పూడ్చివేసి లేఅవుట్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ తన సిబ్బందితో చెరువును పరిశీలించారు. చెరువు ఇరిగేషన్ చెరువుగా గుర్తించామని ఆ శాఖ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తమకు అందిన ఫిర్యాదుల మేరకు చెరువు పూడుస్తున్న కొప్పిశెట్టి రవికి చెరువు తమదే అని నిరూపించే రికార్డులు తీసుకురావాలని, అంతవరకు పనులు నిలిపివేయాలని ఆదేశించామని తెలిపారు. ఇరిగేషన్ అధికారుల సమక్షంలో సర్వే చేయించి సరిహద్దులకు మక్కులు వేయిస్తామని చెప్పారు. ఈ తనిఖీలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసు, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, ఛండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం



స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

తొండంగి: అన్నవరం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 50 మంది భక్తులు రూ.750 చొప్పున టికెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి రుత్విక్కులు లక్షకుంకుమార్చనలు నిర్వహించారు.

నేడు పరదేశమ్మ అమ్మవారి జాతర

తాళ్లరేవు: కోరిన కోర్కెలు తీర్చే తాళ్లరేవు గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారి పెద్ద జాతర మహోత్సవం శనివారం రాత్రి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నెల రోజుల క్రితం అమ్మవారిని మార్కెట్ వీధిలోని అంగన్‌గుడిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారి జాతర, ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

వరలక్ష్మీ నమోస్తుతే..!



పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో పురుహూతికా అమ్మవారు



పిఠాపురంలో లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు



పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు



వాకతిప్పలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భువనేశ్వరీ పీఠంలో సామూహిక వరలక్ష్మి వ్రతం అచరిస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- కిటకిటలాడిన ఆలయాలు
- పాదగయలో వేలాదిగా పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

పిఠాపురం: శ్రావణ మాసంలో రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రం శ్రావణశోభను సంతరించుకుంది. ఉదయం నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పాదగయ కిటకిటలాడింది. పాదగయ పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలను ఆచరించి మహిళలు వరలక్ష్మీదేవి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలోని పురుహూతిక, రాజరాజేశ్వరి అమ్మవార్ల సన్నిధిలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు చేశారు. అనంతరం ఆలయంలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి, పురుహూతిక అమ్మవార్లు, దత్తాత్రేయ స్వామి, సాయిబాబాలను మహిళలు, భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నియోజకవర్గంలో అన్ని గ్రామాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళలు ఎక్కువగా తమ ఇళ్ల వద్ద వరలక్ష్మీ దేవి వ్రతాలు చేసుకున్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి శ్రావణ లక్ష్మి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: వరలక్ష్మీ వ్రతాలను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మహిళలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కనకదుర్గ, వనదుర్గ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక మరిడమ్మ ఆలయం, కాండ్రకోట నూకాలమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. దివిలి భాస్కర రామా రైస్ మిల్లు వద్ద అమ్మవారిని నెలకొల్పి పూజలు నిర్వహించారు. భక్త భజన మండలి భజనలు, పలు సాంసతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మర్లావలో పలువురు మహిళలు ఆలయంలో పూజలు, వ్రతాలను ఆచరించారు.

అలాగే స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరీ పీఠంలో చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు.

కిటకిటలాడిన ఆలయాలు

కొత్తపల్లి: శ్రావణమాసంలో రెండో శుక్రవారం సందర్భంగా గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన దుర్గాదేవి, కొత్తదొడ్డిలోని బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం, గొర్స, ఉప్పాడ గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు ఆలయాల్లో భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో అష్టలక్ష్మీ పూజలు



నవదుర్గా సమేత దుర్గామల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజప్ప



సామర్లకోట నవదుర్గ ఆలయంలో అష్టలక్ష్మీ పూజలు

- నవదుర్గ ఆలయంలో భక్తుల రద్దీ
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన బడేలమ్మ చెరువు వద్ద కొలువైన నవదుర్గా సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అష్టలక్ష్మీ సహిత వరలక్ష్మీ వత్ర మహోత్సవాలు వైవంగా జరిగాయి. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆమె ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఉదయం సామూహిక వరలక్ష్మీ వత్రాలతో పాటు 8 మంది ముత్తైదువులతో అష్టలక్ష్మీ పూజలు చేశారు. వ్రతాలు చేసిన ముత్తైదువులకు విందు, వాయన సత్కారాలు చేశారు. అలాగే 316 మంది ముత్తైదువులకు డ్రా ద్వారా చీరలను అందజేశారు. మధ్యాహ్నం దుర్గామల్లేశ్వరస్వామి దివ్య కల్యాణం జరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి 10 మంది వేద పండితులు కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సత్తిరాజు, యార్లగడ్డ అక్కరాజు, అడబాల కుమారస్వామి, వాడపర్తి వీరభద్ర రావు, వల్లూరి దొరబాబు, గోలి వెంకటఅప్పారావు చౌదరిలు భక్తులకు సేవలందించారు. బ్రౌన్‌పేట సెంటర్‌లోని కనక దుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త నూతలపాటి సింహాచలం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఏర్పాటు చేసి వ్రతకర్తలకు చీరలు అందజేశారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



గొంచాలలో నిరసన తెలియజేసిన మాలమహానాడు నాయకులు

సామర్లకోట: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో మాల మాహనాడు నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా మండల పరిధిలో గొంచాల గ్రామంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిన అచ్చారావు ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఎస్సీ వర్గీకరణ 341 చట్టానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతి రేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని మాల మహానాడు నాయకులు తెలిపారు. ఎస్సీ మాల కులానికి న్యాయం చేయాలని సంఘ నాయకులు ఎస్.దుర్గారావు, సత్తిబాబు, ఎం.నాగరాజు నిరసనలో పాల్గొన్నారు.

కొత్తపల్లి ఎస్సైగా వెంకటేష్



కొత్తపల్లి: స్థానిక ఎస్సైగా జి.వెంకటేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పిఠాపురం టౌన్ అదనపు ఎస్సైగా పనిచేసిన ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న స్వామినాయుడు రిలీవ్ కావలసి ఉంది. ఈ సందర్భంగా నూతన ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా తీర ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు.

ఎంపీడీఓగా శ్రీలలిత



సామర్లకోట: మండల పరిషత్తు అభివృద్ధి అధికారిణిగా డి.శ్రీలలితను నియమించారు. గతంలో ఆమె సామర్లకోట ఎంపీడీఓగా పని చేశారు. ఎన్నికల ముందు ఆమెను పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో విశాఖపట్నం జిల్లా చోడవరంలో పని చేస్తున్న ఎస్‌డీ శ్యామ్‌సుందర్‌ను ఎంపీడీఓగా నియమించారు. ప్రస్తుతం ఎక్కడి ఎంపీడీఓలను అచ్చటకు బదిలీ చేయడంతో శ్రీలలిత శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు పరిపాలనాధికారి మంగతాయారు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమెకు స్వాగత కార్యక్రమంతో పాటు స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ అధికారిగా పురస్కారం పొందిన డి.చంద్రశేఖర్‌కు, అటెండర్ వై.అప్పారావులను సత్కరించనున్నట్టు ఆమె తెలిపారు.

కల్వర్టును బాగుచేయరూ..



అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలోని కల్వర్టుకు పడిన గొయ్యి

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి పోలీసు స్టేషన్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టు శిథిలం అయింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. స్థానిక బలుసుల పేట అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలో ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాల వల్ల భారీ వాహనాల రాక పోకలతో శిథిలమైంది. ఈ కల్వర్టుపై ఒక వైపు స్పీడ్ బ్రేకర్ ఉండటంతో వాహన చోదకులు స్పీడ్ బ్రేకర్ లేని వైపు నుంచి వెళ్తున్నారు. దాంతో ఆ మార్గంలో కల్వర్టు గొయ్యి పడింది. ప్రతి రోజూ వందలాది మంది ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తారు. బలుసులపేట నుంచి స్టేషన్ సెంటర్, నీలమ్మ చెరువు, స్టేట్ బ్యాంకుకు వెళ్లడానికి ఈ కల్వర్టు మీదుగానే రాక పోకలు సాగించాల్సి ఉంది. ఈ కల్వర్టును వెంటనే నిర్మించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావును వివరణ కోరగా అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద శిథిలమైన కల్వర్టును గమనించామని, ఈ నెలలో కౌన్సిల్ సమావేశంలో నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మున్సిపల్ ఏఈ ఉంటే ఎప్పటికప్పుడు ఇటువంటి సమస్యలు గమనించడానికి అవకాశం ఉంటుందన్నారు.

ముంగర్లమ్మ జాతర ప్రారంభం



వేలంకలో ముంగర్లమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

కిర్లంపూడి: వేలంకలో వేంచేసిన ముంగర్లమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 72 సంవత్సరాలుగా అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 24న అమ్మవారి ఆలయం వద్ద జగారం, 25న గ్రామాల్లో పండగ, 26న భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటిన్



సామర్లకోటలో అన్న క్యాంటిన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజప్ప



పిఠాపురం అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే చిన రాజప్ప

సామర్లకోట/పెద్దాపురం: పేదల ఆకలి తీర్చడానికే అన్నా క్యాంటిన్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. నియోజకవర్గ పరిధిలో సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటిన్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, కౌన్సిలర్లు బలుసు వాసు, పితాని కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని తదితరులు పాల్గొన్నారు. సామర్లకోటలో బసివిరెడ్డి సత్రం వద్ద, పెద్దాపురంలో మున్సిపల్ కార్యాలయం వద్ద అన్నా క్యాంటిన్‌లను ప్రారంభించారు.

పిఠాపురంలో..

పిఠాపురం: ప్రజలకు మేలు చేసే పథకాల అమలు చేస్తామని, వాటిలో మార్పులు ఉండవని శాసన మండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) పిడుగు హరిప్రసాద్ స్పష్టం చేశారు. పిఠాపురంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తోందన్నారు. పిఠాపురంలో మరిన్ని అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ యోచిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పిఠాపురం టీడీపీ ఇంచార్జ్ ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పార్టీ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్, బీజేపీ ఇంచార్జ్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: పట్టణ పరిధిలో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్ మరమ్మతుల వల్ల రాజీవ్ గృహకల్ప, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, గణపతినగరం, పెదపులి చెరువు ఏరియా, లారీ యూనియన్ ఆఫీసు, గాంధీనగర్, అమ్మాణమ్మ అపార్టుమెంట్, టిడ్కో గృహసముదాయం, మాజేటినగర్, భాస్కర్‌నగర్, సాయినగర్, మెహర్ కాంప్లెక్స్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

సుప్రీం తీర్పుపై 21న భారత్ బంద్



సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు జేఏసీ నాయకులు

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21న బుధవారం వివిధ ప్రజా, దళిత సంఘాలు సంయుక్తంగా భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్టు మాల మహానాడు జేఏసీ నాయకులు తెలిపారు. నడిపూడి డాబా గార్డెన్‌లో మాల మహానాడు జేఏసీ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. బంద్‌కు అన్ని వర్గాలు, చాంబర్ ఆఫ్ కామర్స్, విద్యాసంస్థలు, దుకాణదారులు, వాహన యూనియన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు సహకరించాలని జేఏసీ నాయకులు పండు అశోక్‌కుమార్, ఎంఏకే భీమారావు, జగడం సత్యనారాయణ, జల్లి శ్రీనివాసరావు, ఉండ్రు బాబ్జీ కోరారు. వర్గీకరణ జరగకుండా ఉద్యమానికి సహకరించాలన్నారు. సమావేశంలో నాయకులు చీకురుమిల్లి కిరణ్‌కుమార్, పెయ్యిల పరశురాముడు, పోతుల నాగరాజు, నాతి శ్రీనివాస్, నక్కా సంపత్‌కుమార్, కుంచే బాబులు, బొంతు రమణ, మెండు రమేష్, గెల్లా రాజేంద్ర, ఉబ్బన శ్రీను, మోకా శ్రీను, ఉటాల వెంకటేష్ సాధనల శ్రీను, మెండి డేవిడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఓటర్ల జాబితా నవీకరించండి

ఆర్డీవో కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఇట్ల కిశోర్

కాకినాడ సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయ ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఇట్ల కిషోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కాకినాడ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియపై ఆయన అన్ని మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయ యూనియన్ల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా నవీకరణపై గత నెల 29న నోటిఫికేషన్ జారీ చేశారని, ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. నూతన ఉపాధ్యాయ ఓటరు నమోదుకు ఓటర్లు ఫారం-19 సమర్పించడానికి 2024 సెప్టెంబర్ 3 చివరి తేదీ అని ఆయన అన్నారు. సెప్టెంబర్ 24న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ, ఆ జాబితాపై క్లైయిములు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు 2024 సెప్టెంబర్ 24 నుంచి అక్టోబరు 15 వరకు అవకాశం ఉందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన క్లైయిములు, అభ్యంతరాలను అక్టోబర్ 30వ తేదీ నాటికి పరిష్కరించి, తుది ఓటర్ల జాబితాను 2024 నవంబర్ 6న ప్రచురించడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులందరికీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఏఈఆర్‌ఓలు అవకాశం కల్పించాలని, అనర్హులు ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితాలో నమోదు కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అందిన ప్రతి క్లైయిము, అభ్యంతరాన్ని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆర్డీవో సూచించారు. సమావేశంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి పితాని త్రినాథరావు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎం అసోసియేషన్, యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీయూఎస్ ఉపాధ్యాయ యూనియన్ల ప్రతినిధుల పాల్గొన్నారు.

చోరీల నియంత్రణపై అవగాహన సదస్సులు

తాళ్లరేవు: సమాజంలో అధికమైన దొంగతనాలు, దోపిడీలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ కోరంగి పోలీసులు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు కాకినాడ డీఎస్పీ, కాకినాడ రూరల్ సీఐల ఆధ్వర్యంలో కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ అవగాహన కల్పించారు. శుక్రవారం కోరంగి పంచాయతీ గుడ్డివాని తూము సెంటర్‌లో వ్యాపారులు, ఆటోడ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రావణ మాసం, పెళ్లిళ్లు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. ఇంటికి తాళాలు వేసేటప్పుడు బయటకు కనిపించకుండా జాగ్రత్త పడాలని, బంగారు వస్తువులు వాడుకకు ఉంచుకుని, మిగిలినవి లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు.